# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 20-08-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- యువ ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించే లక్ష్యంతో రాష్ట్రంలో ఆవిష్కరణ కేంద్రాలను ప్రారంభించామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.

- సికిల్ సెల్ వ్యాధి జన్యు పరీక్షల కోసం త్వరలో విశాఖపట్టణంలోని కేజీహెచ్‌లో 'సెంటర్ ఆఫ్ కాంపెటెన్స్' (సీఓసీ) ఏర్పాటు చేయనున్నామని మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు.

- రాబోయే 4 సంవత్సరాల్లో 2,500 విద్యుత్ బస్సులను ప్రవేశపెట్టనున్నామని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి వెల్లడించారు.

- నూతన నేర చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని కేంద్ర హోం శాఖ కార్యదర్శి గోవింద్ మోహన్ స్పష్టం చేశారు.

================================

ఆంధ్రప్రదేశ్ ఆవిష్కరణలకు కేంద్రంగా మారుతుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విశ్వాసం వ్యక్తం చేశారు. మంగళగిరిలోని మయూరి టెక్ పార్కులో ఏర్పాటు చేసిన రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ను టాటా సన్స్ ఛైర్మన్ చంద్రశేఖరన్, మంత్రి నారా లోకేష్ తో కలిసి ముఖ్యమంత్రి ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అమరావతిలో రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ను ప్రారంభించటం ఓ చారిత్రాత్మక సమయమని తెలిపారు. `గివ్ బ్యాక్ టు ది సొసైటీ` అనే విధానాన్ని రతన్ టాటా అవలంభించారని ఆయన ఆలోచనలను భవిష్యత్ తరాలకు అందించాలన్న లక్ష్యంతోనే ఇన్నోవేషన్ హబ్ ను ప్రారంభించామన్నారు. యువ ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు, అంకుర సంస్థలకు ఊతమిచ్చేలా ఈ ఇన్నోవేషన్ హబ్ పని చేస్తుందని స్పష్టం చేశారు. అమరావతితో పాటు రాష్ట్ర వ్యాప్తంగా ఐదు చోట్ల ఇన్నోవేషన్ కేంద్రాలను హబ్ అండ్ స్పోక్ మోడల్ లో ఏర్పాటు చేశామని వివరించారు. విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి, అనంతపురంలోనూ దీనికి అనుబంధంగా కేంద్రాలు పని చేస్తాయని ముఖ్యమంత్రి వివరిస్తూ...

(వాయిస్ 35 సెకన్లు)

ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఐటీ శాఖా మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ... ఇన్నోవేషన్ వ్యాలీ ఆఫ్ ఇండియాగా ఆంధ్రప్రదేశ్ ను తీర్చిదిద్దుతామన్నారు. విద్యార్థి దశ నుంచే యువత ఆవిష్కరణలపై దృష్టి సారించాలన్నారు.

===============================

నూతన నేర చట్టాలను అమలు చేయడంలో ఆంధ్రప్రదేశ్ దేశానికి ఆదర్శంగా నిలిచేలా తగు చర్యలు తీసుకోవాలని కేంద్ర హోం శాఖ కార్యదర్శి గోవింద్ మోహన్ పేర్కొన్నారు. ఈ చట్టాలను పటిష్టంగా అమలుకు చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్, డి.జి.పి. హరీశ్ కుమార్ గుప్తాలతో ఈ రోజు ఢిల్లీ నుండి గోవింద్ మోహన్ దృశ్య మాధ్యమ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... దేశంలో కొత్తగా అమల్లోకి వచ్చిన నేర చట్టాలు భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్ష సంహిత, భారతీయ సాక్ష్య అధినియంలను క్షేత్ర స్థాయిలో పటిష్టవంతంగా అమలు చేసేందుకు వివిధ పోలీస్ స్టేషన్లు, న్యాయస్థానాలు, జైళ్లు, ఫోరెన్సిక్ లేబరేటరీల్లో మౌలిక సదుపాయాలు, సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో ఉండాలన్నారు. నేరం జరిగిన ప్రాంతాల్లో ఆడియో, వీడియో చిత్రీకరణ చేయాలని, అన్ని ఎఫ్ఐఆర్‌లను ఇ-సాక్ష్యంలో పొందుపర్చాలని డి.జి.పి.కి గోవింద్ మోహన్ సూచించారు.

===============================

గిరిజనుల ఆరోగ్య సంరక్షణ కోసం విశాఖపట్టణంలోని కేజీహెచ్‌లో 'సెంటర్ ఆఫ్ కాంపెటెన్స్' (సీఓసీ) ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపిందని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. సికెల్ సెల్ వ్యాధిని గుర్తించేందుకు అవసరమైన జన్యు పరీక్షలు ఈ కేంద్రంలో జరుగుతాయని, ఇందుకు కేంద్రప్రభుత్వం 4 కోట్ల రూపాయలను కేటాయించిందన్నారు. మరో మూడు నెలల్లో ఈ కేంద్రంలో జన్యు పరీక్షలు ప్రారంభిస్తామని మంత్రి తెలిపారు. అదనంగా మరో కేంద్రాన్ని గుంటూరు జీజీహెచ్‌లో ఏర్పాటు చేసేందుకు కూడా కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపిందన్నారు. వీటి రాకతో గిరిజనుల ఆరోగ్య సంరక్షణ చర్యలు మరింత మెరుగుపడతాయని మంత్రి పేర్కొన్నారు.

===============================

రాష్ట్రంలో అమలవుతున్న పథకాలలో ఎక్కువ మంది లబ్ధిదారులు ఉన్న పథకం స్త్రీ శక్తి అని రవాణా శాఖా మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. స్త్రీ శక్తి పథకం విజయవంతంగా అమలవుతుండటంపై మంత్రి ఈ రోజు విజయవాడలో పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... స్త్రీ శక్తి పథకం ప్రారంభించి ఆరవ రోజుకే సుమారు 65 లక్షల మంది మహిళలు ఉచితంగా బస్సు ప్రయాణం చేశారని తెలిపారు. ఇప్పటివరకు 25 కోట్ల రూపాయలు ఖర్చయిందని, ఆ మొత్తాన్ని ఏపీఎస్ఆర్టీసీకి చెల్లిస్తున్నామని వివరించారు. త్వరలోనే 750 ఎలక్ట్రిక్ ఏసీ బస్సులు రానున్నాయని, రాబోయే 4 సంవత్సరాల్లో 2,500 ఎలక్ట్రిక్ బస్సులను ప్రవేశపెట్టనున్నామని మంత్రి వెల్లడిస్తూ...

(వాయిస్ 31 సెకన్లు)

విరామం

===============================

విశాఖపట్టణం వేదికగా ఈనెల 29న జాతీయ క్రీడా దినోత్సవాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నామని ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) ఛైర్మన్ అనిమిని రవినాయుడు తెలిపారు. గుంటూరులోని నాగార్జున విశ్వవిద్యాలయంలో జోనల్ స్థాయి క్రీడా పోటీలను ఆయన ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... క్రీడా రంగాన్ని అగ్రస్థానంలో నిలబెట్టడమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. అంతర్జాతీయ హాకీ క్రీడాకారుడు మేజర్ ధ్యాన్ చంద్ ను స్మరించుకుంటూ ఆయన జయంతి సందర్భంగా ఈనెల 29న జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. క్రీడాకారులకు తగిన గుర్తింపు, గౌరవం కల్పించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం క్రీడలను ప్రోత్సహిస్తుందన్నారు. దానిలో భాగంగానే జిల్లా, జోనల్, రాష్ట్ర స్థాయి పోటీల్లో గెలుపొందిన విజేతలకు ఈనెల 29న నిర్వహించే జాతీయ క్రీడా దినోత్స వేడుకల్లో ముఖ్యమంత్రి చేతులు మీదుగా నగదు ప్రోత్సాహకాలు, పతకాలు అందజేస్తామన్నారు. క్రీడాకారుల జీవిత భద్రతకు రాత పరీక్ష లేకుండా 3 శాతం రిజర్వేషన్ తో స్పోర్ట్స్ కోటా కింద అన్ని ప్రభుత్వ శాఖల్లోనూ ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నామని చెప్పారు.

================================

ఏజెన్సీలోని గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు విద్యను అందించడంతో పాటు వారి ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి కట్టా సింహాచలం పేర్కొన్నారు. మారేడుమిల్లి మండలం దేవరపల్లి గ్రామంలో గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలను ఆయన ఈరోజు ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... గిరిజన ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రతిరోజు పాఠశాల చుట్టుపక్కల ఎప్పటికప్పుడు దోమలు వ్యాపించకుండా పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. ప్రభుత్వం నిబంధన ప్రకారం విద్యార్థులకు సంబంధించిన మెనూను తప్పనిసరిగా అమలు చేయాలని సిబ్బందిని ఆదేశించారు.

================================

రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన 'ఆవిష్కరణాంధ్ర' కార్యక్రమం గిన్నిస్ బుక్ రికార్డును సొంతం చేసుకుంది. 24 గంటల్లోనే అత్యధికంగా 1.67 లక్షల మంది పారిశ్రామికవేత్తలు తమ పేర్లను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవడం ద్వారా గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌ను కైవసం చేసుకుంది. ఈ రికార్డు సర్టిఫికేట్‌ను గిన్నిస్ బుక్ ప్రతినిధులు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు ఈరోజు అందించారు.

================================

జాతీయ క్రీడా దినోత్సవం -2025 ను పురస్కరించుకుని ఈనెల 22, 23వ తేదీలలో విశాఖపట్నంలో జోనల్ స్థాయి స్పోర్ట్స్ మీట్ జరుగుతుందని కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ తెలిపారు. ఈ స్పోర్ట్స్ మీట్ నిర్వహణపై అధికారులతో కలెక్టర్ ఈరోజు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సంబంధిత అధికారులందరూ సమన్వయంతో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసి స్పోర్ట్స్ మీట్ ను విజయవంతం చేయాలన్నారు. దీనిలో శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, విశాఖపట్నం జిల్లాలకు చెందిన క్రీడాకారులు పాల్గొంటారని తెలిపారు.

================================

తూర్పు మధ్యప్రదేశ్ లో ఏర్పడిన అల్పపీడనం ఈరోజు బలహీన పడిందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. ఆగ్నేయ మధ్యప్రదేశ్, దాని పరిసర ప్రాంతాలలో సగటు సముద్ర మట్టానికి 4.5 కిలోమీటర్ల ఎత్తు వరకు ఉపరితల ఆవర్తనం విస్తరించి ఉందని వాతావరణం కేంద్రం అధికారి ఎం. వెంకట్రావు పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ మీదుగా దిగువ ట్రోపో ఆవరణంలో నైరుతి, పశ్చిమ దిశగా గాలులు వీస్తున్నాయని తెలిపారు. వీటి ఫలితంగా రాష్ట్రంలో రాగల మూడు రోజుల పాటు నెలకొన్న వాతావరణ వివరాలను ఆయన వెల్లడిస్తూ...

(వాయిస్ 33 సెకన్లు)

================================
================================